శనగ రైతు బెంగ

- ఈ ఏడాది పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు
- మార్కెట్లో పతనమైన ధరలు
- తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- పెట్టుబడులు కూడా దక్కని వైనం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



ఈ ఫొటోలోని దుత్తలూరుకు చెందిన రైతు పేరు గువ్వల సుబ్బారెడ్డి. ఈయన రబీ సీజన్‌లో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని శనగ పంట సాగుచేశారు. ఎకరాకు రూ.7వేలు కౌలుతో కలిపి సుమారు రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. ఎకరాకు సరాసరిన ఐదు క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. తీర పంట చేతికి అందేసరికి ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం క్వింటాకు రూ.5,650 మద్దతు ధరను ప్రకటించగా, దళారులు రూ.5,500కు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో శనగలను ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. మంచి ధరలు వస్తాయోమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.



కోల్డ్ స్టోరేజీకి ట్రాక్టర్‌లో తరలిస్తున్న శనగల బస్తాలు

దుత్తలూరు: ఈ ఏడాది శనగ పంట రైతులను ముంచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పెట్టుబడులు పెరిగాయి. అందుకు తగ్గట్లుగా పంట దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. దీనికితోడు మార్కెట్లో ధరలు పతనమై పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

9,500 ఎకరాల్లో సాగు

జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 9,500 ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. ప్రధానంగా దుత్తలూరు, పొదలకూరు, చేజర్ల, అనంతసాగరం, ఏఎస్‌పేట, కలిగిరి, కొండాపురం, వరికుంటపాడు మండలాల్లో అధికంగా పంటను సాగు చేశారు. గతేడాది వర్షాభావ పరిస్థితులతో ఆలస్యంగా సాగు చేపట్టారు. శనగ పంట వేసిన తరువాత నుంచి వర్షాలు అధికంగా కురవడంతో కొన్ని ప్రాంతాల్లో పంట దెబ్బతింది. దీంతో మళ్లీ సాగు చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కారణంగా పంట అదును దాటిపోవడం..తెగుళ్లు విజృంభించడం..తదితర కారణాలతో ఆశించిన మేర దిగుబడులు రాలేదు.

దిగుబడులు లేవు..ధరలు లేవు

ఈ ఏడాది శనగ పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. సరాసరి ఎకరాకు 5 క్వింటాల లోపే దిగుబడులు వచ్చాయి. దీనికి తోడు పంట చేతికి వచ్చేసరికి ధరలు కూడా పతనమయ్యాయి. ప్రభుత్వం శనగలకు క్వింటాకు రూ.5,650 మాత్రమే మద్దతు ధరను ప్రకటించింది. బయట మార్కెట్‌లో దళారులు క్వింటాను రూ.5,500కు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా సాగుకు సుమారు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు అయినట్లుగా రైతులు చెబుతున్నారు. సరాసరిన ఎకరాకు 5క్వింటాళ్ల మేర మాత్రమే దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం ఉన్న ధరలకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ధరలు పెరుగుతాయనే ఆశతో..

ప్రస్తుతం శనగలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు పంటను నిల్వ ఉంచుకున్నారు. ధరలు పెరుగుతాయనే ఆశతో కొందరు ఇళ్లలోనూ, మరికొందరు కోల్డ్‌స్టోరేజీలకు తరలించి నిల్వ చేసుకున్నారు. మరికొందరు రైతులు రోజులు గడిస్తే పెట్టుబడుల అప్పుల వడ్డీలు పెరుగుతాయని, తూకాలు తగ్గిపోతాయని వచ్చిన కాడికే తెగనమ్ముకుంటున్నారు. గతంలో జిల్లా అధికారులు శనగల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సవాలక్ష కొర్రీలు పెడుతారని రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో ఇంత వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీనిపై ప్రభుత్వం కూడా సీరియస్‌గా దృష్టి పెట్టకపోవడంతో రైతులను పట్టించుకునే నాథుడే కరువైపోయారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్న చందంగా శనగ పంట ధరలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. సాగు సమయంలో ప్రభుత్వం సబ్సిడీపై క్వింటా విత్తనాలను రూ.7వేలకు అందజేసింది. కానీ దిగుబడులు వచ్చాక కనీసం సబ్సిడీ విత్తనాల ధరకు కూడా కొనుగోలు చేయకుండా ప్రభుత్వం చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలను అందించి నష్టపోకుండా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఇంట్లో నిల్వ చేసిన శనగ బస్తాలు

ఆశించిన దిగుబడులు రాలేదు



ఈ ఏడాది శనగ పంటను అదును దాటి వేయడంతో ఆశించిన మేర దిగుబడులు రాలేదు. పంట చేతి కందేసరికి ధరలు కూడా పతనమయ్యాయి. సబ్సిడీపై విత్తనాలను క్వింటా రూ.7వేలకు అందజేసిన ప్రభుత్వం మద్దతు ధరను రూ.5650గా ప్రకటించింది. దళారులు రూ.5500కు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ధరలు పెరుగుతాయనే ఆశతో నిల్వ ఉంచుకున్నాం.

– మద్దసాని రాజా, సత్యవోలు అగ్రహారం, కొండాపురం మండలం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం



ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలో శనగ సాగుచేసిన రైతుల వివరాలు ఈక్రాప్‌లో నమోదు చేశాం. ఉన్నతాధికారులు ఆదేశించిన మీదట కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. శనగలు విక్రయించాలనుకున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తాం.

– పీ చెన్నారెడ్డి, ఏడీఏ ఉదయగిరి

క్లుప్తంగా

గరుడ వాహనం బహూకరణ



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని తిరునాళ్ల తిప్ప వద్ద ఉన్న పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పట్టణంలోని చల్లావీధికి చెందిన చల్లా రామకృష్ణారెడ్డి, జ్యోతి, మల్లికార్జునరెడ్డి, హరిత, శివకుమార్‌రెడ్డి, సుమతి దంపతులు గరుడ వాహనాన్ని శుక్రవారం బహూకరించారు. ఆలయ అర్చకులు నూతన గరుడ వాహనానికి దాతల చేతుల మీదుగా పంచద్రవ్యాలతో అభిషేకాలు చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంఈఓ-2 సాయిప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి నాణ్యతను పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణోత్సవం



సంగం: మండలంలోని అమరపునాయుడుకండ్రికలోని ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపారు.

మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఆత్మకూరు: పట్టణంలోని మందుల దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బీఎస్సార్ సెంటర్‌లోని ఓ మెడికల్‌షాపులో మందుల స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన షాపుల నిర్వాహకులు వెంటనే మూసివేశారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారులను సంప్రదించగా సాధారణ తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

సబ్‌జైలు సూపరింటెండెంట్ బదిలీ



ఆత్మకూరు: ఆత్మకూరు సబ్‌జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ నెల్లూరు జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అక్కడి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు. కాగా బదిలీపై వెళ్తున్న విజయ్‌కుమార్, బదిలీపై వచ్చిన అరుణ్‌కుమార్‌ను జైలు సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది మూర్తి, దాసు, ఖాజా రంతుల్లా, అంకయ్య, వీఆర్వో వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలు



సంగం: మండలంలోని ర్యాంపు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయాలపాలయ్యారు. వివరాలు..ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు పుచ్చకాయల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్‌ను సంగం వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంపచెట్ల తొలగింపు

ఉదయగిరి: పట్టణంలో నుంచి వ్యవసాయ కళాశాల, సీతారామపురం వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను హైవే అధికారులు శుక్రవారం తొలగించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.

సాయిబాబా పాదుకల దర్శనం



అల్లూరు: అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, శివప్రియ దంపతుల ఆహ్వానం మేరకు వారి స్వగృహానికి షిర్డీ సాయిబాబా పాదుకలు, వస్త్రాలు గురువారం రాత్రి చేరుకున్నాయి. పాదుకలు, వస్త్రాలను పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయినాథుని భక్తబృందంతో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు భక్తుల దర్శనం కోసం ఉంచారు.

బీఎల్వోలతో సమీక్ష



సీతారామపురం: స్థానిక స్త్రీశక్తి భవనంలో బీఎల్వోలతో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొత్త ఓటర్ల చేర్పుల్లో ఫ్యామిలీ మెంబర్లను తప్పనిసరిగా అనుసంధానం చేయాలన్నారు. ఫారం-8, సవరణలు, మార్పులు, చేర్పులు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు విషయంలో ఆచితూచి వ్యవహరించాలని సూచించారు.

హౌస్‌హోల్డ్ సర్వే 98శాతం పూర్తి

ఉదయగిరి: మండలంలో చేపడుతున్న హౌస్‌హోల్డ్ సర్వే 98శాతం పూర్తయిందని ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం తెలిపారు. హౌస్‌హోల్డ్ సర్వే చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. ఇప్పటి వరకు సర్వే చేయించుకోని వారు నెలాఖరులోగా తమ కుటుంబాల వివరాలను సర్వే బృందానికి తెలియజేసి మిగిలిన 2శాతం సర్వే పూర్తికి సహకరించాలని కోరారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఉదయగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారిణి ఎం శివకల్పన పిలుపునిచ్చారు. ఈ నెల 24న జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలో గండిపాళెం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య, టీబీ యూనిట్ సిబ్బంది విద్యార్థులతో కలిసి శుక్రవారం క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాగులబావి వీధి నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఎం శివకల్పన మాట్లాడుతూ క్షయ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యూబరిక్యూలోస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతున్నారు. ఈ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఈ వ్యాధిని గళ్ల పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని తెలిపారు. 6 నుంచి 8 నెలల వరకు మందులు వాడడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది వెంకటసుబ్బయ్య, బీ వెంకటేశ్వర్లు, నౌషాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ రేపు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సుమారు 150 మంది దివ్యాంగులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆత్మకూరు-నెల్లూరుపాళెం మధ్యన ఉన్న ఖాళీ స్థలంలో చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. అనంతరం కూటమి ఆత్మీయ సమావేశంలో ఇరువురు పాల్గొంటారని తెలిపారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ టీ చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, తదితరులు ఉన్నారు.

సమయాన్ని పాటించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్డీ భార్గవి

సీతారామపురం: సచివాలయ సిబ్బంది సమయాన్ని తప్పనిసరిగా పాటించాలని ఈఓపీఆర్డీ భార్గవి అన్నారు. శుక్రవారం ఆమె సీతారామపురంలోని బిట్-1 సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సర్వేలు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

దేపూరులో ఉపాధి పనులు ప్రారంభం



ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరులో ఉపాధి హామీ పనులు పునఃప్రారంభమయ్యాయి. గ్రామంలో ఆరు నెలలుగా ఉపాధి పనులు చేపట్టడం లేదు. ఈ విషయమై ఇటీవల దేపూరుకు చెందిన పారిశ్రామికవేత్త భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ సుధీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనులతో పాటు అవెన్యూ ప్లాంటేషన్ పనులను కూడా చేపట్టాలని కోరారు. అవెన్యూ ప్లాంటేషన్ పనులకు తాను ఆర్థిక తోడ్పాటును అందిస్తానని భాస్కర్‌నాయుడు విన్నవించినా ఆ దిశగా ఉపాధి అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు ఆవేదన చెందుతున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ రామ్మోహన్‌రావును వివరణ కోరగా ఇటీవల పంటలు సాగులో ఉండి గ్రామం చుట్టూ నీరు నిల్వ ఉండడంతో ఉపాధి పనులు చేపట్టలేకపోయామని, ఇకపై యథావిధిగా పనులు కొనసాగిస్తామని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి అధికారుల నుంచి ఆదేశాలు వస్తే ప్రారంభిస్తామని తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ఆత్మకూరు: ప్రభుత్వం మహిళల స్వయం ఉపాధి కోసం ఉచితంగా కుట్టుశిక్షణను అందజేయనున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బీసీ, కాపు, ఈబీసీ, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులని చెప్పారు. 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డీసీపల్లిలో 308 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 308 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 320 బేళ్లు రాగా, అందులో 308 బేళ్లను విక్రయించామని చెప్పారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.265, సగటు ధర రూ.278.34 పలికిందని వివరించారు. వేలంలో 40,170 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,11,81,290 వ్యాపారం జరిగిందని తెలిపారు. కాగా వేలంలో ఏడు కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పారీకి నివాళి



ఉదయగిరి: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారీ వెంకటస్వామి వర్ధంతిని ఉదయగిరిలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అప్పారీ చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పారీ 14 ఏళ్ల ఉద్యోగ సర్వీసును వదులుకుని యూనియన్ అభివృద్ధి కోసం 25 ఏళ్ల పాటు శ్రమించారన్నారు. జీవితాంతం ఉపాధ్యాయుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. యూటీఎఫ్ నాయకులు కే చంద్రశేఖర్, బాలగురవయ్య, ఫణిరాజు, తిరుపతయ్య,సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

కొండాపురం: మండలంలోని గుడవళ్లూరులోని ఓ ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన చిమిలి మహేష్ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని వివిధ పత్రాలను చిందరవందరగా పడేశారు. రూ.3 వేలు నగదును అపహరించుకెళ్లారు. స్థానికుల సమాచారంతో ఎస్సై ఎం.వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్త్రీనిధి రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఏజీఎం కామాక్షయ్య

వరికుంటపాడు: స్త్రీనిధి రుణాల రికవరీపై సీసీలు, వీఓఏలు ప్రత్యేక దృష్టి సారించాలని స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామాక్షయ్య అన్నారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో స్త్రీనిధి రుణాల రికవరీపై వెలుగు సిబ్బందితో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికుంటపాడు మండలం స్త్రీనిధి రుణాల రికవరీలో పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. రుణాల రికవరీ ఎన్‌పీఏను రూ.10 లక్షలకు తగ్గిస్తేనే కొత్త రుణాల మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఎన్‌పీఏను జీరో శాతానికి తీసుకొచ్చేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా ఏజీఎం ప్రకాష్, స్త్రీనిధి మేనేజర్లు శ్రీధర్, నరసింహారావు, ఏపీఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు కనీస అక్షరాస్యత తప్పనిసరి



దుత్తలూరు: పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేస్తున్న అధికారులు



ఏఎస్‌పేటలో పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అంకయ్య



సీతారామపురంలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వైనారూత్

దుత్తలూరు: వయోజనులకు కనీస అక్షరాస్యత తప్పనిసరి అని ఎంపీడీఓ మల్లికార్జున అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీలకు ఉల్లాస్ పరీక్షలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉల్లాస్‌లో భాగంగా అక్షరాలు నేర్చుకున్న వయోజనులకు ఈ నెల 23న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోజనులకు అవగాహన కల్పించి అక్షరాలు నేర్చుకున్న వారందరూ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. వయోజన విద్య కావలి డివిజన్ సూపర్‌వైజరు షేక్ బాదుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజరు షేక్ షాను, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ పరీక్షల నిర్వహణపై అంగన్‌వాడీలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం సతీష్ మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షరాలు నేర్చుకున్న 363 వయోజనులకు ఈ నెల 23న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోజన విద్య సూపర్‌వైజర్ అంకయ్య పరీక్షల నిర్వహణపై అంగన్‌వాడీలకు సూచనలు చేశారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉల్లాస్ పరీక్షల నిర్వహణపై అంగన్‌వాడీలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం వైనారూత్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 316 మంది నిరక్షరాస్యులైన వయోజనులకు గత నాలుగు నెలలుగా అక్షరాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. వారందరికీ ఆదివారం పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసరావు, చెన్నకేశవులు, కృష్ణయ్య, మరియమ్మ, తిరుపాలు, పద్మావతి పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ



కలిగిరి: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను సీఐ పీ వెంకటనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు శాఖ అధ్యక్షుడు జీ ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దార్ రవీంద్రారెడ్డి, పశువైద్యాధికారి సురేష్‌బాబుతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో క్యాలెండర్లను పంపిణీ చేశారు. సభ్యులు సుధాకర్‌రావు, పెంచలరత్నం, మాలకొండారెడ్డి, మహేంద్ర, కొండలరావు, వెంకటసుబ్బమ్మ, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీతో అదనపులోడు క్రమబద్ధీకరణ

కొండాపురం: విద్యుత్ అదనపు లోడ్ క్రమద్దీకరణకు సంబంధించి ప్రభుత్వం విధిస్తున్న డెవలప్‌మెంట్ చార్జీలపై 50 శాతం రాయితీని అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో వాట్‌కు రూ.2,250 ఉండగా, రాయితీతో రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. రెండు కిలో వాట్లకు రూ.4,450 ఉండగా, రాయితీపై రూ.2,450, మూడు కిలో వాట్లకు రూ.6,650 ఉండగా, రాయితీపై రూ.3,650, నాలుగు కిలో వాట్లకు రూ.8,850 ఉండగా, రాయితీపై రూ.4,850, ఐదు కిలోవాట్లకు రూ.11,050 ఉండగా, రాయితీపై రూ.6,050 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.